సాక్షి
సంగారెడ్డి
శనివారం । 30 । నవంబర్ । 2024




ఆకట్టుకున్న ఇన్‌స్పైర్..

జిల్లా కేంద్రంలో ఇన్‌స్పైర్, సైన్స్ ప్రాజెక్టుల ప్రదర్శన రెండోరోజూ కొనసాగింది. విద్యార్థులు అనేక ఎగ్జిబిట్‌లను రూపొందించారు. వివరాలు 8లో ▸



డ్రగ్స్ రహిత జిల్లాయే లక్ష్యం

గంజాయి, ఇతర మత్తు పదార్థాల రహిత జిల్లాగా సిద్దిపేటను తయారు చేద్దామని సీపీ అనురాధ పిలుపునిచ్చారు. వివరాలు 8లో ▸



యాసంగికీ ఎదురు చూపులే!

యాసంగి సీజన్‌లో సాగుకోసం సింగూరు జలాలను ఎప్పుడు విడుదల చేస్తారోనని రైతులు ఎదురుచూస్తున్నారు. వివరాలు 9లో ▸

న్యూస్‌రీల్

వేగంగా సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి పనులు

ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డి



ఆస్పత్రి వైద్య బృందంతో పాటు సిబ్బందిని సన్మానిస్తున్న ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి

పటాన్‌చెరు: పటాన్‌చెరు నియోజకవర్గ కేంద్రంలోని టంగుటూరి అంజయ్య ప్రభుత్వ ఏరియా ఆస్పత్రికి అందరి సమష్టి కృషి వల్లే ఉత్తమ సేవల విభాగంలో జాతీయస్థాయిలో ఏడవ స్థానం లభించిందని ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి పేర్కొన్నారు. రూ. 350 కోట్ల అంచనా వ్యయంతో చేపడుతున్న సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి పనులు శరవేగంగా కొనసాగుతున్నాయని ఆయన తెలిపారు. శుక్రవారం ఆస్పత్రిలో నిర్వహించిన సమావేశంలో మహిపాల్‌రెడ్డి వైద్యులు, వైద్య సిబ్బందిని ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ...20 ఏళ్ల క్రితం అప్పటి ముఖ్యమంత్రి దివంగత మహానాయకుడు వైఎస్ రాజశేఖర్‌రెడ్డి నేతృత్వంలో ఏరియా ఆస్పత్రికి జీవోను ఇచ్చారన్నారు. 2012లో ఆస్పత్రి ప్రారంభించిన నాటి నుంచి ఇప్పటివరకు అన్ని రకాల నాణ్యమైన వైద్యసేవలు అందిస్తూ ప్రజల మన్ననల్ని పొందుతోందని తెలిపారు. త్వరలోనే ఆస్పత్రిలో డయాలసిస్ కేంద్రాన్ని ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. సమావేశంలో జిల్లా వైద్యాధికారి గాయత్రి, డీసీహెచ్‌ఎస్ అధికారి సంగారెడ్డి, ఏరియా ఆస్పత్రి వైద్య బృందం సభ్యులు పాల్గొన్నారు.

మానసిక ఉల్లాసానికే వనభోజనాలు

ఆర్టీసీ ఆర్‌ఎం ప్రభులత



ఆటల పోటీల విజేతలకు బహుమతులను అందజేస్తున్న ఆర్‌ఎం.ప్రభులత

జహీరాబాద్ టౌన్: విధుల్లో తలమునకలయ్యే ఉద్యోగులకు మానసిక ఉల్లాసాన్ని కలిగించేందుకే కార్తీక మాస వనభోజనాల కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఆర్టీసీ రీజినల్ మేనేజర్ ప్రభులత పేర్కొన్నారు. జహీరాబాద్ ఆర్టీసీ డిపోలో ఉద్యోగులు, వారి కుటుంబాలకు సంస్థ ఎండీ సజ్జనార్ ఆదేశాల మేరకు శుక్రవారం వన భోజనాలు ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ప్రభులత మాట్లాడుతూ...కార్తీకమాసంలో వన భోజనాలు నిర్వహిస్తున్నా విధుల కారణంగా ఈ కార్యక్రమానికి హాజరుకాలేని పరిస్థితి ఉందన్నారు. అనంతరం ఆమె డిపోలో కొత్త శిక్షణ కేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా నిర్వహించిన ఆటల పోటీల్లో గెలుపొందిన విజేతలకు బహుమతులను అందజేశారు. డిపో ఆవరణలో మొక్కలు నాటారు. కార్యక్రమంలో డిపో మేనేజర్ జాకీర్ హుస్సేన్, అసిస్టెంట్ మేనేజర్ ప్రవీణ్ కుమార్, గ్యారేజ్ సూపర్‌వైజర్ తిరుమలేష్ తదితరులు పాల్గొన్నారు.

పొగ మంచులో ప్రయాణం ప్రమాదకరం

జిల్లా ఎస్పీ చెన్నూరి రూపేశ్

సంగారెడ్డి జోన్: పొగ మంచులో ప్రయాణం ప్రమాదకరమని, పొగ మంచు తగ్గిన తర్వాతే ప్రయాణాలు చేయాలని జిల్లా ఎస్పీ చెన్నూరి రూపేష్ శుక్రవారం ఓ ప్రకటనలో సూచించారు. పొగమంచు కారణంగా రోడ్లపై ఎదురుగా వచ్చే వాహనాలు కనిపించవని, ఈ సమయంలోనే ఎక్కువ ప్రమాదాలు జరిగేందుకు అవకాశముంటుందని వివరించారు. వాహనదారులు పరిమిత వేగంతో ప్రయాణిస్తే ప్రమాదాలు జరగకుండా నియంత్రించే అవకాశం ఉంటుందన్నారు. రైతులు వరి ధాన్యం కుప్పలు రోడ్లపై ఆరబెట్టడం వల్ల కూడా ప్రమాదాలు జరుగుతాయని అందువల్ల రోడ్లపై ధాన్యం ఆరబెట్టవద్దని స్పష్టం చేశారు.

జేఎన్టీయూలో సైన్స్ కేంద్రం

జీవో జారీ చేసిన ప్రభుత్వం

సంగారెడ్డి: సుల్తాన్‌పూర్ జేఎన్టీయూలో సైన్స్ సెంటర్ ఏర్పాటు కానుంది. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వం శుక్రవారం జీవోను విడుదల చేసింది. తెలంగాణ కౌన్సిల్ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీ ఆధ్వర్యంలో అండర్ కేటగిరీ–3లో టైప్(బీ)లో భాగంగా రూ.6.65కోట్లతో సైన్స్ సెంటర్‌ను ప్రభుత్వం ఏర్పాటు చేయనుంది. ఈ సెంటర్ ఏర్పాటులో మంత్రి దామోదర రాజనర్సింహ కీలక పాత్ర వహించారు. సైన్స్ సెంటర్ ఏర్పాటుకు రాష్ట్ర ఫైనాన్స్ డిపార్ట్‌మెంట్ ఇప్పటికే ఆమోదం తెలిపింది. కళాశాలకు సైన్స్ కేంద్రం వస్తుండటంతో జిల్లా ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

మన్ను తిన్న మంజీరా..!

సింగూరులో పేరుకుపోయిన పూడిక

- పూడికతీతకు నీటిపారుదలశాఖ సన్నాహాలు
- గతేడాది సెడిమెంటేషన్ స్టడీ నిర్వహణ
- 0.7 టీఎంసీల నీటి నిల్వ సామర్థ్యం తగ్గినట్లు తేల్చిన ఏజెన్సీ



సాక్షిప్రతినిధి, సంగారెడ్డి: సింగూరు ప్రాజెక్టులో పేరుకు పోయిన సిల్ట్ (పూడిక) తొలగించే యోచనలో నీటి పారుదల శాఖ ఉంది. ప్రాజెక్టు నిర్మించిన నాటి నుంచి ఒక్కసారి కూడా ఈ సిల్ట్ తొలగించలేదు. దీంతో ఈ ప్రాజెక్టు నీటి నిల్వ సామర్థ్యం క్రమంగా తగ్గుతూ వస్తోంది. ఉమ్మడి జిల్లాకు సాగునీరు, హైదరాబాద్ జంట నగరాలకు తాగునీరందిస్తున్న ఈ ప్రాజెక్టు నిర్మాణం 1989లో జరిగింది. వర్షాకాలంలో వరద జలాల రాకతో ఏటా జలాశయంలోకి సిల్ట్ వచ్చి చేరుతోంది. ఎగువ నుంచి వచ్చే నీటి ప్రవాహంతో ఇసుక, మట్టి, ఇతర వ్యర్థాలు కొట్టుకు వస్తున్నాయి. దీంతో క్రమంగా ప్రాజెక్టు నీటి నిల్వ సామర్థ్యం తగ్గుతూ వస్తోంది. ఈ ప్రాజెక్టు పూర్తి నీటి నిల్వ సామర్థ్యం 29.917 టీఎంసీలు (523.600 మీటర్లు).

స్టడీ నివేదిక..

ఈ ప్రాజెక్టులో ఎంత మేరకు పూడిక పేరుకు పోయిందనే అంశంపై నీటిపారుదల శాఖ గతేడాది సెడిమెంటేషన్ స్టడీ నిర్వహించింది. ఓ ప్రైవేటు ఏజెన్సీకి ఈ బాధ్యతలు అప్పగించింది. జలాశయంలో పడవల్లో తిరుగుతూ ప్రత్యేక నిపుణులు ఎంతమేరకు పూడిక పేరుకు పోయిందనే అంశంపై అధ్యయనం చేశారు. సుమారు 0.71 టీఎంసీల మేరకు తగ్గేంత పూడిక ఈ ప్రాజెక్టులో పేరుకు పోయినట్లు ఆ ఏజెన్సీ నివేదిక ఇచ్చినట్లు నీటి పారుదలశాఖ వర్గాలు చెబుతున్నాయి.

ఎలా ముందుకెళ్లాలి..

పూడికతీత విషయంలో ఎలా ముందుకెళ్లలనే అంశాన్ని పరిశీలిస్తున్నారు. పూడిక తీస్తే ఆ మట్టిని రైతులకు ఇవ్వాలా...ఎవరికి ఇవ్వాలి వంటి అంశాలు తెరపైకి వస్తున్నాయి. ఈ ప్రాజెక్టు పరిధిలో మొత్తం 72 గ్రామాలు ఉన్నాయి. ఈ గ్రామాల రైతులకే ప్రాధాన్యత ఇవ్వాలా...లేదంటే ఇతర గ్రామాల రైతులకూ ఇవ్వాలా.. అనే అంశం పరిశీలించాల్సి ఉంది. పంటలకు ఎంతో ఉపయోగపడే ఈ మట్టిని వాణిజ్యపరమైన అవసరాలకు విక్రయిస్తే భూగర్భ గనులశాఖ నుంచి అనుమతులు తీసుకోవాల్సి ఉంటుంది. ఆ మట్టికి సంబంధించిన రాయల్టీని చెల్లించాల్సి ఉంటుంది. దీంతో సంబంధిత శాఖ నుంచి అనుమతుల అంశం పరిశీలించనున్నారు. వీటన్నింటిపై ప్రభుత్వం నుంచి మార్గదర్శకాలు రావాల్సి ఉంటుంది. ఇటీవల జరిగిన సమీక్షలో సింగూరు పూడికతీత అంశంపై ప్రస్తావనకు వచ్చిందని, దీనిపై ప్రభుత్వం నిర్ణయం తీసుకోవాల్సి ఉంటుందని నీటిపారుదలశాఖ ఉన్నతాధికారి ఒకరు 'సాక్షి'ప్రతినిధితో పేర్కొన్నారు.

జలసౌధ సమీక్షలో ప్రత్యేక ప్రస్తావన..

ఉమ్మడి మెదక్ జిల్లాలోని సాగునీటి ప్రాజెక్టులు, చిన్న నీటి వనరుల పనుల ప్రగతిపై ఇటీవల హైదరాబాద్‌లోని జలసౌధలో సమీక్ష జరిగింది. నీటిపారుదలశాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, జిల్లా మంత్రి దామోదర రాజనర్సింహ, టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి తదితరులు ఈ సమీక్షలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా సింగూరు ప్రాజెక్టులో పూడికతీత అంశం ప్రధానంగా చర్చకొచ్చింది. పైలెట్ ప్రాజెక్టుగా రాష్ట్రంలో ఏదైనా ఒక ప్రాజెక్టులో పూడిక తొలగింపు ప్రక్రియ చేసి...ఎదురైన సవాళ్లను బట్టి రెండో ప్రాజెక్టుగా సింగూరులో పూడికతీత ప్రక్రియ చేపట్టాలని మంత్రులు నిర్ణయించారు.

భరోసా ఇచ్చేలా పనిచేయాలి

- మంత్రి శ్రీధర్‌బాబు
- పాసింగ్ అవుట్ పరేడ్‌లో గౌరవ వందనం స్వీకరణ



గౌరవ వందనాన్ని స్వీకరిస్తున్న శ్రీధర్‌బాబు

పటాన్‌చెరు టౌన్: రాష్ట్రానికి, ప్రజలకు సేవ చేయడానికి పోలీసు ఉద్యోగం గొప్ప అవకాశమని, ప్రజలకు భరోసా ఇచ్చేలా పనిచేయాలని శిక్షణ పూర్తిచేసుకున్న ఎస్పీఎఫ్ కానిస్టేబుళ్లను ఉద్దేశించి మంత్రి శ్రీధర్ బాబు వ్యాఖ్యానించారు. శుక్రవారం అమీన్‌పూర్‌లో శిక్షణ పూర్తిచేసుకున్న ఎస్పీఎఫ్ కానిస్టేబుళ్లు నిర్వహించిన పాసింగ్ అవుట్ పరేడ్‌కు రాష్ట్ర హోం శాఖ ప్రిన్సిపాల్ సెక్రెటరీ రవి గుప్త, ఎస్పీఎఫ్ డీజీపీ అనిల్ కుమార్, ఎస్పీఎఫ్ డీఐజీ మాధవరావులతో కలసి మంత్రి శ్రీధర్‌బాబు హాజరయ్యారు. ఈ సందర్భంగా పాసింగ్ అవుట్ పరేడ్‌లో మంత్రి గౌరవ వందనం స్వీకరించారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ..విధుల్లో రాణించేందుకు పోలీసులకు ప్రభుత్వం ఎల్లప్పుడూ తోడ్పాటునందిస్తుందన్నారు. రాష్ట్ర భద్రత, పురోగతి పోలీసుల చేతుల్లోనే ఉందని, బాధ్యతలు నిర్వర్తించే సమయంలో క్రమశిక్షణతో, అంకితభావంతో ఉండాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఎస్పీఎఫ్ అధికారులు పాసింగ్ అవుట్ కానిస్టేబుళ్లు పాల్గొన్నారు.

తెలంగాణను ఆగం చేస్తున్నారు

- పదేళ్లలో చేసిన అభివృద్ధిని పాడుచేస్తున్న కాంగ్రెస్
- సంగారెడ్డి దీక్షా దివస్‌లో బీఆర్‌ఎస్ నాయకులు



దీక్షా దివస్‌లో మాట్లాడుతున్న చింతా ప్రభాకర్

సంగారెడ్డి/కంది: తెగించి తెచ్చిన తెలంగాణను కాంగ్రెస్ నాయకులు ఆగం చేస్తున్నారని, కేసీఆర్ ఉద్యమ స్ఫూర్తితో ప్రత్యేక రాష్ట్ర సాధన సాధ్యమైందని బీఆర్‌ఎస్ పార్టీ నాయకులు పేర్కొన్నారు. పదేళ్లలో రాష్ట్రంలో కేసీఆర్ చేసిన అభివృద్ధిని పాడు చేస్తున్న కాంగ్రెస్‌కు ప్రజలు త్వరలోనే తగిన గుణపాఠం చెబుతారని జోస్యం చెప్పారు. జిల్లాలో శుక్రవారం దీక్షా దివస్‌ను బీఆర్‌ఎస్ పార్టీ శ్రేణులు ఘనంగా నిర్వహించాయి. కందిలోని జిల్లా పార్టీ కార్యాలయంలో ముందుగా తెలంగాణ తల్లి విగ్రహానికి పూలమాలలు వేసి, జెండా ఎగురవేశారు. సభ ప్రారంభానికి ముందు ఉద్యమ డాక్యుమెంటరీని ప్రదర్శించారు. అనంతరం పార్టీ జిల్లా అధ్యక్షుడు, సంగారెడ్డి ఎమ్మెల్యే చింతా ప్రభాకర్ మాట్లాడుతూ...తెలంగాణ ప్రజలకు కేసీఆరే శ్రీరామరక్ష అని అన్నారు. దీక్షా దివస్ స్ఫూర్తితో బీఆర్‌ఎస్‌ను మరింత బలోపేతం చేసి మరోసారి పార్టీని అధికారంలోకి తీసుకురావాలని పిలుపునిచ్చారు. కాంగ్రెస్ పాలన చూస్తుంటే మరోసారి ఉద్యమించడం తప్పదనిపిస్తోందని చెప్పారు. జహీరాబాద్ ఎమ్మెల్యే మాణిక్‌రావు, మాజీ ఎమ్మెల్యే క్రాంతి కిరణ్ మాట్లాడుతూ...పార్టీని మళ్లీ అధికారంలోకి తెచ్చేందుకు కృషి చేయాలని కార్యకర్తలకు పిలుపునిచ్చారు. రాష్ట్ర నాయకులు దేవి ప్రసాద్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో మాజీ జెడ్పీ చైర్‌పర్సన్ మంజుశ్రీ,, మాజీ ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి, డీసీఎంఎస్ చైర్మన్ శివకుమార్, డీసీసీ బ్యాంకు వైస్ చైర్మన్ మాణిక్యం, జిల్లా నాయకులు బీరయ్య యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

హాస్టళ్లలో నిరంతర తనిఖీలు

కలెక్టర్ వల్లూరు క్రాంతి



మాట్లాడుతున్న కలెక్టర్ వల్లూరు క్రాంతి

సంగారెడ్డి జోన్: జిల్లాలోని కస్తూర్బా పాఠశాలలు, సంక్షేమ హాస్టళ్లు, సంక్షేమ గురుకుల, మోడల్ పాఠశాలల్లో నిరంతరం తనిఖీలు నిర్వహించాలని సంబంధిత అధికారులను కలెక్టర్ వల్లూరు క్రాంతి ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్‌లో ఆయా శాఖల అధికారులు, గురుకులాల, కేజీబీవీల ప్రత్యేక అధికారులతో జిల్లా కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ...జిల్లాలోని అన్ని మండలాల ప్రత్యేక అధికారులు తమ పరిధిలోని సంక్షేమ వసతి గృహాలు, సంక్షేమ గురుకుల పాఠశాలలను తనిఖీ చేయడంతోపాటు విద్యార్థులతో కలసి భోజనం చేయాలన్నారు. హాస్టళ్లు, గురుకుల పాఠశాలల ఆవరణలు పరిశుభ్రంగా ఉండాలని ఆదేశించారు. తరగతి గదులు విద్యార్థుల గదులను కిటికీలు డోర్లు అవసరమైన మరమ్మతులను వెంటనే చేపట్టాలని తెలిపారు. నాసిరకం వస్తువులను వెంటనే వెనక్కి పంపేలా చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు చంద్రశేఖర్, మాధురి, జెడ్పీసీఈవో జానకిరెడ్డి, వివిధ మండలాల ప్రత్యేక అధికారులు బీసీ,ఎస్సీ, ఎస్టీ సంక్షేమ వసతి గృహాల, గురుకుల పాఠశాలల ప్రత్యేక అధికారులు, ఆర్సీవోలు పాల్గొన్నారు.

లీ-ఫార్మా పరిశ్రమకు పీసీబీ నోటీసులు

జిన్నారం (పటాన్‌చెరు): జిన్నారం మండలం గడ్డపోతారం పారిశ్రామికవాడలోని లీ-ఫార్మా పరిశ్రమ తీరును హెచ్చరిస్తూ కాలుష్య నియంత్రణ మండలి (పీసీబీ) అధికారులు చర్యలు చేపట్టారు. ఈ మేరకు శుక్రవారం పరిశ్రమకు నోటీసులు జారీ చేశారు. గతంలో పరిశ్రమ నుంచి పైపుల ద్వారా బహిరంగ ప్రదేశాల్లోకి నీటి విడుదల, వాయు కాలుష్యంతో స్థానికులకు ఇబ్బందులు తలెత్తుతున్నాయని పీసీబీ అధికారులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు పీసీబీ యంత్రాంగం పరిశ్రమను హెచ్చరిస్తూ నోటీసులు జారీ చేసింది. భవిష్యత్తులో ఇలాంటి ఘటనలకు పాల్పడితే ముందస్తు నోటీసులు లేకుండా పరిశ్రమను మూసివేస్తామని హెచ్చరించారు.

ఉత్తమ సేవలే గుర్తింపునిస్తాయి

మార్కెటింగ్ శాఖ రాష్ట్ర అదనపు డైరెక్టర్ రవికుమార్



అనిల్‌బాబు దంపతులను సత్కరిస్తున్న రవికుమార్

జహీరాబాద్: ఉద్యోగులు విధి నిర్వహణలో అందించిన ఉత్తమసేవలతోనే గుర్తింపు లభిస్తుందని రాష్ట్ర మార్కెటింగ్ శాఖ అదనపు డైరెక్టర్ పి.రవికుమార్ పేర్కొన్నారు. జహీరాబాద్‌లోని మార్కెట్ ఆవరణలో శుక్రవారం జరిగిన మార్కెట్ కార్యదర్శి అనిల్‌బాబు పదవీ విరమణ వీడ్కోలు కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ...అనిల్ బాబు ఎంతో నిబద్ధతతో పనిచేశారన్నారు. రాష్ట్రంలోనే జహీరాబాద్ మార్కెట్‌కు మంచి ఆదాయాన్ని సాధించిపెట్టారని అభినందించారు. ఈ సందర్భంగా అనిల్‌బాబు దంపతులను మార్కెటింగ్ శాఖ తరపున సత్కరించారు.

చెరుకు రైతులకు చేదే!

ప్రారంభమైన కోతలు

- ట్రైడెంట్‌లో ఈసారీ లేని క్రషింగ్
- దళారులకు అమ్ముకుంటున్న పంట
- నష్టపోతున్న రైతులు



జహీరాబాద్ ప్రాంతంలో చెరుకు కొడుతున్న కూలీలు

జహీరాబాద్ టౌన్: జహీరాబాద్ ప్రాంతంలో చెరుకు కోతల సీజన్ ప్రారంభమైంది. అయితే ఏడాది పొడుగునా రైతులు పడ్డ కష్టం దళారుల పాలవుతోంది. విత్తనం నాటి నుంచి కర్మాగారానికి సరఫరా వరకు రైతులకు తిప్పలు తప్పడం లేదు. అటు దిగుబడి రాక..ఇటు గిట్టుబాటు ధర లేక..పెట్టుబడులు కూడా రాని పరిస్థితులు ఉత్పన్నమయ్యాయి. దీనికి తోడు జహీరాబాద్ సమీపంలోని ట్రైడెంట్ చక్కెర కర్మాగారంలో ఈ సంవత్సరం కూడా క్రషింగ్ జరగడంలేదు. దీంతో రైతులు పండించిన పంటను బ్రోకర్లకు అమ్ముకుంటున్నారు. దళారులు తక్కువ ధరకు కొనడం వల్ల నష్టాలు చవి చూస్తున్నారు.

> జహీరాబాద్ ప్రాంతంలో చెరుకు కోతలు షురూ అయ్యాయి. అయితే ఈసారైనా రైతులకు తీయటి లాభాలు తెచ్చిపెడుతుందనుకున్న చెరుకు దళారులపాలై చేదునే మిగులుస్తోంది. జహీరాబాద్ సమీపంలోని ట్రైడెంట్ చక్కెర కర్మాగారంలో ఈఏడాది క్రషింగ్ లేకపోవడంతో చెరుకు రైతులు తమ పంటను దళారుల చేతుల్లో పెడుతుండటంతో రైతులకు నష్టాలు తప్పడంలేదు.

గిట్టుబాటు కాని ధర

పెరిగిన పెట్టుబడులకు అనుగుణంగా గిట్టుబాటు కాని ధరను దళారులు రైతులకు ఇస్తున్నారు. ఎరువులు, పురుగు మందులు, కలుపు, కార్మికుల కూలి పెరగడంతో ఎకరాకు రూ.20 వేలు దాటుతోంది. స్థానిక కర్మాగారంలో క్రషింగ్ జరగనందున పొలంలోని పంటను ఖాళీ చేసేందుకు రైతులు తక్కువ ధరకు దళారులకు ఇచ్చేస్తున్నారు. టన్నుకు కనీసం రూ.3,500 చెల్లిస్తే గిట్టుబాటు అయ్యే పరిస్థితుల్లో దళారులు కేవలం రూ. 2,600 రైతులకు చెల్లిస్తున్నారు. డ్రైవర్ బత్తా, కూలీల ఖర్చును రైతులే భరించుకుంటున్నారు. దీంతో రైతులకు టన్నుకు రూ.2,400 మాత్రమే పడుతుంది. తక్కువ ధరకు అమ్ముకున్న చెరుకు బిల్లులు ఎప్పుడు వస్తాయో తెలియని పరిస్థితి ఉంది. బ్రోకర్లను కాదని రైతులు కర్మాగారానికి చెరుకు సరఫరా చేద్దామనుకుంటే కూలీల కొరత వేధిస్తోంది. ఒక్కో బ్యాచ్‌లో 20 మంది కూలీలు ఉంటారు. ఇంతమంది కూలీలు దొరకడం రైతులకు కష్టతరంగా మారింది. ఈ పరిస్థితుల్లోనే రైతులు తమ పంటను తరలించేందుకు దళారులను ఆశ్రయిస్తున్నారు.

తగ్గిన పంట విస్తీర్ణం...

జహీరాబాద్ ప్రాంతంలో ఈ ఏడాది సుమారు 3 లక్షల టన్నులకు పైగా చెరుకు పంటను సాగు చేస్తున్నారు. గతేడాదితో పోలిస్తే ఈసారి పంట విస్తీర్ణం తగ్గింది. ప్రతీ సంవత్సరం 5 లక్షల టన్నులకు పైగా పంట సాగయ్యేది. రెండేళ్ల నుంచి చెరుకు రైతులు గడ్డుకాలం ఎదుర్కొంటున్నారు. గత రెండు మూడేళ్లుగా ట్రైడెంట్ చక్కెర కర్మాగారంలో క్రషింగ్ సరిగ్గా జరగకపోవడంతో రైతులు భారీగా నష్టపోయారు. ఈసారైనా ఆదుకుంటుందనుకున్న ట్రైడెంట్ షుగర్ ఫ్యాక్టరీ కూడా క్రషింగ్ ఉండదని తేల్చి చెప్పడంతో చెరుకు రైతులు నిరాశలో కూరుకుపోయారు. తప్పనిసరి పరిస్థితుల్లో రైతులు తక్కువ ధరకు దళారులకు పంటను అమ్ముకుంటున్నారు.

నష్టపోక తప్పడం లేదు...



ట్రైడెంట్ కర్మాగారంలో క్రషింగ్ జరగకపోవడంతోనే దళారులకు పంటను అమ్ముకుంటున్నాం. వీరికి పంటను అమ్ముకోవడం వల్ల లాభాలు రాకున్న పెట్టుబడులు మాత్రమే వస్తున్నాయి. జహీరాబాద్ ప్రాంతం ప్రధాన పంట అయిన చెరుకు గిట్టుబాటు ధరపై ప్రభుత్వం శాశ్వత చర్యలు తీసుకోవాలి. ట్రైడెంట్ కర్మాగారంలో ప్రతీ ఏటా చెరుకు క్రషింగ్ జరిగితే రైతులకు ఊరట లభిస్తుంది.

–డి.శివకుమార్, రైతు, ఎల్గోయి

అభివృద్ధిని విస్మరించిన బీఆర్‌ఎస్: సంజీవరెడ్డి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే డాక్టర్ సంజీవరెడ్డి

నారాయణఖేడ్: పదేళ్ల బీఆర్‌ఎస్ పాలనలో అభివృద్ధి కుంటుపడటమే కాకుండా రహదారులు మరమ్మతులు లేక అధ్వానంగా మారాయని ఎమ్మెల్యే సంజీవరెడ్డి ఆరోపించారు. నాగల్‌గిద్ద మండలం కారముంగి గ్రామంలో నిర్మించిన సైన్స్‌ల్యాబ్ ప్రారంభోత్సవం, బీసీ భవన నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ...కాంగ్రెస్ హయాంలో నిర్మించిన రహదారులకు పదేళ్ల కాలంలో మరమ్మతులు కూడా చేయలేక రోడ్లు అధ్వానంగా మార్చారని ఆరోపించారు. దెబ్బతిన్న రహదారులు అభివృద్ధికి కృషి చేస్తానని తెలిపారు. విద్య, వైద్యరంగాల్లో అభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. పేద విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించేందుకు ఖేడ్‌కు రూ.150కోట్లతో ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్ మంజూరు అయ్యిందని తెలిపారు. సమావేశంలో కాంగ్రెస్ నాయకులు గెందురావు, విఠల్‌రావు పాటిల్ తదితరులు పాల్గొన్నారు.



ప్యారవరం గ్రామ శివారులో ఉధృతంగా ప్రవహిస్తున్న వరద (ఫైల్)

రూ. 3కోట్లతో ప్యారవరం వంతెన

- నిర్మాణ పనులకు నేడు శంకుస్థాపన

ఝరాసంగం(జహీరాబాద్): ఎన్నో ఏళ్ల ప్యారవరం వంతెన కల త్వరలో సాకారం కానుంది. వంతెన నిర్మాణానికి రాష్ట్ర ప్రభుత్వం రూ.3కోట్ల నిధులు మంజూరు చేయడంతోపాటుగా బ్రిడ్జి పనులకు శనివారం శంకుస్థాపన చేయనుంది. వంతెన నిర్మాణం పూర్తయితే ప్యారవరం ప్రజల రాకపోకలకు ఇబ్బందులు తప్పనున్నాయి.

వర్షాకాలంలో తప్పని ఇబ్బందులు...

ప్రతీ సంవత్సరం వర్షాకాలంలో గ్రామానికి ప్రజలు రాకపోకలు సాగించేందుకు తీవ్ర ఇబ్బందులు పడేవారు. వాస్తవానికి వరద నీరు ప్రవహిస్తున్న సమయంలో రాకపోకలు సాగించేందుకు వీలుండేదికాదు. వరద ప్రవాహం తగ్గేంత వరకు అటూ ఇటూ వేచి చూడాల్సిన పరిస్థితులున్నాయి. బ్రిడ్జి నిర్మించాలని ఎన్నోసార్లు అధికారులు, ప్రజా ప్రతినిధులకు వినతి పత్రాలు అందించినా అవి బుట్టదాఖలయ్యాయే కానీ ప్రభుత్వాలు పట్టించుకున్న దాఖలాలు లేవు. అయితే రాష్ట్రం ప్రభుత్వం తాజాగా రహదారుల అభివృద్ధి కార్యక్రమంలో భాగంగా ప్యారవరం బ్రిడ్జి నిర్మాణం కలను సాకారం చేస్తూ రూ.3కోట్ల సీఆర్ఆర్ నిధులు మంజూరు చేయడంతో స్థానికుల్లో ఆనందం వ్యక్తమవుతోంది.



13వ వర్ధంతి
మంచి పోరాటము పోరాడితిని, నా పరుగు కడ ముట్టించితిని, విశ్వాసమును కాపాడుకొంటిని. ఇక మీదట నా కొరకు నీతికిరీటముంచబడియున్నది. 2వ తిమోతి 4: 7-8
భర్త : బి.రూబెన్
కుమారులు - కోడళ్ళు
స్వర్గీయ శ్రీమతి మాణిక్యం
జననం : 01-07-1948
మరణం : 30-11-2011
08451-282745

క్లుప్తంగా

రాష్ట్ర స్థాయిలో ప్రతిభ


విద్యార్థులను సన్మానిస్తున్న ప్రిన్సిపాల్, పీడీ

చిన్నకోడూరు(సిద్దిపేట): రాష్ట్ర స్థాయిలో నిర్వహించిన దివ్యాంగ విద్యార్థుల క్రీడా పోటీల్లో మండల పరిధిలోని ఇబ్రహీంనగర్ ఆదర్శ పాఠశాల విద్యార్థులు ప్రతిభ చూపి పతకాలు సాధించారు. హైదరాబాద్‌లో నిర్వహించిన క్రీడా పోటీల్లో విద్యార్థి లిఖిత్ క్యారమ్‌లో మొదటి స్థానంలో నిలిచాడు. జావేద్ 100 మీటర్ల రన్నింగ్‌లో, నందకిషోర్ షాట్‌పుట్‌లో ప్రతిభ చూపి పతకాలు సాధించారు. ఈ సందర్భంగా పాఠశాల హెచ్‌ఎం సతీష్, పీడీ గుండి ప్రవీణ్, ఉపాధ్యాయులు విద్యార్థులను అభినందించారు.

టేబుల్ టెన్నీస్‌లో రాష్ట్రస్థాయికి ఎంపిక


రాష్ట్రస్థాయికి ఎంపికైన విద్యార్థులు

కొండపాక(గజ్వేల్): కుకునూరుపల్లి హైస్కూల్ విద్యార్థులు రాష్ట్ర స్థాయిలో నిర్వహించే టేబుల్ టెన్నీస్ పోటీలకు ఎంపికయ్యారని హెచ్‌ఎం (ఎంఈఓ) బచ్చలి సత్తయ్య తెలిపారు. ఉమ్మడి మెదక్ జిల్లా వ్యాప్తంగా గురువారం నిర్వహించిన అండర్ 14 విభాగంలో విద్యార్థులు గైని భరద్వాజ్ హర్షిత్, మోహిత్ విజయ్, భానుప్రియ ప్రతిభ కనబర్చినట్లు పేర్కొన్నారు. వీరంతా డిసెంబరు రెండో వారంలో మెదక్‌లో జరిగే రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొంటారన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులను హెచ్‌ఎం సత్తయ్య ప్రత్యేకంగా అభినందిస్తూ శిక్షణిచ్చిన పీఈటీ రాజ్‌కుమార్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

డ్రగ్స్ రహిత జిల్లాయే లక్ష్యం


కిట్ ఆర్టికల్‌ను పరిశీలిస్తున్న సీపీ అనురాధ

దుబ్బాక : గంజాయి, ఇతర మత్తు పదార్థాల రహిత జిల్లాగా సిద్దిపేటను తయారు చేద్దామని సీపీ అనురాధ అన్నారు. శుక్రవారం దుబ్బాక పోలీస్‌స్టేషన్‌ను ఆకస్మికంగా తనిఖీ చేశారు. పోలీస్ స్టేషన్ చుట్టూ ఉన్న పరిసరాలతోపాటు సీజ్ చేసిన వాహనాలను, రిసెప్షన్ ఏరియా, పోలీస్ సిబ్బంది కిట్ ఆర్టికల్‌ను, రికార్డు రూమ్‌ను పరిశీలించి మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఇసుక, జూదం, పీడీఎస్ రైస్ అక్రమ రవాణా జరుగకుండా నిఘాను ఏర్పాటు చేసి ఎప్పటికప్పుడూ కేసులు నమోదు చేయా లన్నారు. ప్రతీ కేసులో క్వాలిటీ ఇన్వెస్టిగేషన్ చేయాలన్నారు. గంజాయి, డ్రగ్స్, మత్తు పదార్థాల అనర్థాలపై స్కూల్స్, కాలేజీల్లో గ్రామాల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలన్నారు.

పోలీసులు ఆరోగ్యాలు జాగ్రత్త

ఆరోగ్యాలపై పోలీసు సిబ్బంది జాగ్రత్తగా ఉండాలని సీపీ సూచించారు. పోలీస్ సిబ్బంది సాధక బాధలను అడిగి తెలుసుకున్నారు. విధి నిర్వహణతోపాటు ఆరోగ్యాన్ని కాపాడుకోవాలన్నారు. వాకింగ్, రన్నింగ్, యోగాను తప్పకుండా చేయాలన్నారు. కార్యక్రమంలో ఏసీపీ మధు, దుబ్బాక సీఐ శ్రీనివాస్, ఎస్‌ఐ గంగరాజు, ఎస్బీ ఇన్‌స్పెక్టర్లు శ్రీధర్‌గౌడ్, రామకృష్ణ, కోర్టు లైజనింగ్ ఇన్‌స్పెక్టర్ కమలాకర్, సీసీ నితిన్‌రెడ్డి, ఏఎస్‌ఐ సంధాని తదితరులు ఉన్నారు.

చలి పంజా..

- రోజురోజుకూ పడిపోతున్న కనిష్ట ఉష్ణోగ్రతలు
- రాష్ట్రంలోనే రెండో స్థానంలో న్యాల్‌కల్
- ఇబ్బందులు పడుతున్న ప్రజలు

న్యాల్‌కల్(జహీరాబాద్): రోజు రోజుకూ ఉష్ణోగ్రతలు పడిపోతూ చలి తీవ్రత పెరుగుతూ వస్తుంది. చలి తీవ్రతకు తెల్లవారుజామున ఇంటి నుంచి బయటకు రావాలంటే వణుకుతున్నారు. పొగ మంచు వల్ల వాహనదారులు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. గ్రామాల్లో చలి నుంచి ఉపశమనం పొందేందుకు మంటలు వేసుకొని కాపుకుంటున్నారు. వ్యవసాయదారులు ఉదయాన్నే పొలానికి వెళ్లాలంటే జంకుతున్నారు. ఎండ వచ్చి చలి తీవ్రత తగ్గాకే పనులకు వెళ్తున్నారు. ఉదయం 10 గంటలు దాటినా చలి తీవ్రత తగ్గకపోవడంతో ఎప్పుడు జనసందడిగా ఉండే ప్రాంతాలు వెలవెలబోతున్నాయి.


ఎండలో కూర్చొని చదువుకుంటున్న విద్యార్థులు

8.2 డిగ్రీల ఉష్ణోగ్రతలు

న్యాల్‌కల్‌లో రోజురోజుకూ కనిష్ట ఉష్ణోగ్రతలు పడిపోతున్నాయి. రాష్ట్రంలో ఆసిఫాబాద్ జిల్లాలోని సిర్పూర్‌లో 8.1 డిగ్రీల అతి తక్కువ ఉష్ణోగ్రతలు నమోదు కాగా, 8.2 డిగ్రీల ఉష్ణోగ్రతతో న్యాల్‌కల్ రాష్ట్రంలోనే రెండో స్థానంలో నిలిచింది. అలాగే జిల్లాలో మొదటి స్థానంలో ఉంది. గతంలో ఎన్నడూ లేని విధంగా ఉష్ణోగ్రతలు పడిపోయి చలి తీవ్రత పెరుగుతుండంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఉదయం పూట ప్రజలు ఇళ్ల నుంచి బయటకు రావడానికి జంకుతున్నారు. చలికి తోడు చల్లని గాలులు వీస్తుండడంతో వారు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. చలి తీవ్రత వల్ల రైతులు, కూలీలు మరింత ఇబ్బందులు పడుతున్నారు. ప్రస్తుతం పత్తి తీసే పనులు ముమ్మరంగా కొనసాగుతున్నాయి. అసలే కూలీల కొరత కారణంగా ఇబ్బందులు పడుతున్న రైతులు చలి వల్ల ఉన్న కూలీలు ఇబ్బందులు పడుతుండడంతో చేతికి వచ్చిన పత్తి పొలాల్లో నేలరాలుతుందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

పాఠశాలల్లో తగ్గిన హాజరుశాతం

చలి తీవ్రత కారణంగా పాఠశాలల్లో విద్యార్థుల హాజరు శాతం పడిపోతుంది. జిల్లాలో ప్రభుత్వం, ప్రైవేట్ పాఠశాలల్లో సుమారు 2.50 లక్షలు మంది విద్యార్థులు విద్యాభ్యాసం చేస్తున్నారు. వారం రోజుల నుంచి చలి తీవ్రత పెరగడంతో ఇబ్బందులు పడుతున్నారు. విద్యార్థులు చలికి తట్టుకునే స్వెటర్లు, ఇతర దుస్తులను ధరించి పాఠశాలలకు వెళ్తున్నారు. మధ్యాహ్నం కూడా చలి తగ్గకపోవడంతో పాఠశాలల ఆవరణలో ఎండలో కూర్చుని చదువుకుంటున్నారు. రోజుకు 72 నుంచి 80 శాతం మేర విద్యార్థులు పాఠశాలలకు హాజరవుతున్నట్లు సమాచారం.


చలి తీవ్రతతో స్వెటర్లు వేసుకొని పాఠశాలకు వచ్చిన విద్యార్థులు

బడికి స్వెటర్లతో వెళ్తున్నాం



ఉదయం 9 గంటలైనా చలి తగ్గడం లేదు. పాఠశాలకు వెళ్లేందుకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నాం. తప్పని పరిస్థితుల్లో స్వెటర్లు వేసుకొని బడికి వెళ్తున్నాం. స్వెటర్లు వేసుకున్నా చలి వల్ల ఇబ్బందులు తప్పడం లేదు.

– శ్రేయ, విద్యార్థి జెడ్పీహెచ్ఎస్, న్యాల్‌కల్

పొలానికి వెళ్లలేకపోతున్నాం



ఐదారు రోజుల నుంచి చలి ఎక్కువగా ఉంటుంది. పత్తి ఏరేందుకు ఉదయం 6 గంటలకే పొలాలకు వెళ్లే వాళ్లం. చలి వల్ల ఆలస్యంగా వెళ్తున్నాం. ఎండ వచ్చినప్పటికీ చలి మాత్రం తగ్గడం లేదు. చలి వల్ల కూలీ కూడా గిట్టుబాటు కావడం లేదు.

– సంగప్ప, కూలీ

హాజరుశాతం తగ్గుతుంది



ప్రస్తుతం చలి తీవ్రత అధికంగా ఉంది. దీంతో పాఠశాలలకు వచ్చేందుకు విద్యార్థులు ఇబ్బంది పడుతున్నారు. చలి, జ్వరాల వల్ల 3 నుంచి 4 శాతం మేర హాజరు తగ్గింది. తల్లిదండ్రులు తమ పిల్లలకు స్వెటర్లు, చలికి తట్టుకొనే ఇతర దుస్తులు వేసి బడికి పంపాలి.

– వెంకటేశ్వర్లు, డీఈఓ, సంగారెడ్డి

భవనంపై టీవీ డిష్ తీస్తుండగా..

- నాలుగో అంతస్తు పై నుంచి పడి వ్యక్తి మృతి

పటాన్‌చెరు టౌన్: ప్రమాదవశాత్తు భవనం పై నుంచి పడి వ్యక్తి మృతి చెందిన ఘటన పటాన్‌చెరు పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఎస్‌ఐ కోటేశ్వర్ రావు కథనం మేరకు.. ఏపీలోని ప్రకాశం జిల్లాకు చెందిన శ్రీను (40) భార్య సుజాతతో కలిసి బతుకుదెరువు కోసం వచ్చి పటాన్‌చెరు మండలం ఇస్నాపూర్‌లో ఉంటూ మేస్త్రీ పని చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. ఇటీవలె ఇక్కడి ఉంచి మరో చోటుకి ఇల్లు మారాడు. ఈ క్రమంలో గురువారం ఇంటి పై ఉన్న టీవీ డిష్‌ను తీసుకునేందుకు వచ్చి నాలుగో అంతస్తు నుంచి ప్రమాదవశాత్తు జారి కింద పడ్డాడు. స్థానికులు కుటుంబ సభ్యులు చికిత్స కోసం పటాన్‌చెరు ప్రభుత్వాస్పత్రికి తీసుకురాగా పరిశీలించిన వైద్యులు మృతి చెందినట్లు వెల్లడించారు. మృతుడి భార్య సుజాత ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

చేపల వేటకు వెళ్లి వ్యక్తి..

శివ్వంపేట(నర్సాపూర్) : చేపల వేటకు వెళ్లిన వ్యక్తి నీట మునిగి మృతి చెందిన ఘటన శుక్రవారం వెలుగులోకి వచ్చింది. ఎస్‌ఐ మధుకర్ రెడ్డి కథనం మేరకు.. మండల పరిధి భోజ్యా పంచాయతీ మాల్యా తండాకు చెందిన రాట్ల రంజీ(60) ఇంట్లో నుంచి బయటకు వెళ్లి రెండు, మూడు రోజుల కోసారి ఇంటికి వచ్చేవాడు. 27 ఇంట్లో నుంచి బయటకెళ్లి తిరిగి రాలేదు. శుక్రవారం ఉదయం గంగాయిపల్లి గ్రామ శివారులోని చింత చెరువులో రంజీ మృతదేహం తేలడంతో స్థానికులు చూసి కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చారు. చేపలు పట్టేందుకు వెళ్లి ప్రమాదవశాత్తు చెరువులో మునిగి మృతి చెందినట్లు తెలిపారు. మృతుడి భార్య లక్ష్మీ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ పేర్కొన్నారు.

హార్వెస్టర్‌ను ఢీకొట్టిన బైక్

- ఇద్దరు అక్కడికక్కడే మృతి


సాయిలు(ఫైల్)

హవేళిఘణాపూర్(మెదక్) : హార్వెస్టర్‌ను బైక్ ఢీకొట్టడంతో ఇద్దరు మృతి చెందారు. ఈ ఘటన మెదక్ మండల పరిధిలోని మంభోజిపల్లి శివారులో చోటు చేసుకుంది. మెదక్ రూరల్ ఎస్‌ఐ మురళీ కథనం మేరకు.. మెదక్ మండలం పేరూర్ గ్రామానికి చెందిన గౌండ్ల సాయిలు(47), తిప్పపురం యేసుమణి, వెంకటిల ఏకైక కుమారుడు వంశీ(25) ఇద్దరూ కలిసి మెదక్ వైపు నుంచి బైక్‌పై ఇంటికి తిరిగి వస్తునానరు. మెదక్–బొడ్మట్‌పల్లి రోడ్డుపై హార్వెస్టర్‌ను బైక్ వెనుక నుంచి ఢీకొట్టడంతో ఇద్దరు అక్కడికక్కడే మృతి చెందారు. మృతుడు గౌండ్ల సాయిలుకు భార్య నిర్మల ఇద్దరు పిల్లు ఉన్నారు. ఒకే గ్రామానికి చెందిన ఇద్దరు మృతి చెందడంతో గ్రామంలో విషాదచాయలు అలుముకున్నాయి. ఘటనా స్థలాన్ని పరిశీలించి కేసు నమోదు చేసినట్లు తెలిపారు.


వంశీ(ఫైల్)

కంటైనర్ లారీలో మంటలు


తగులబడుతున్న కంటైనర్

పటాన్‌చెరు టౌన్: కంటైనర్ లారీలో మంటలు చెలరేగిన ఘటన పటాన్‌చెరు మండలం పరిధిలో చోటు చేసుకుంది. డ్రైవర్ కథనం మేరకు.. ముంబై నుంచి ఓ కంటైనర్‌లో లారీ భువనగిరి జనరేటర్‌ను తీసుకెళ్తున్నాం. మండల పరిధిలోని రుద్రారం జాతీయ రహదారిపై గణేశ్ గడ్డ దేవస్థానం సమీపంలోకి రాగానే చిన్న స్పార్క్ వచ్చి లారీలో మంటలు వ్యాపించాయి. లారీ పూర్తిగా కాలిపోగా దీంతో అప్రమత్తమై కిందకు దిగిపోవడంతో పెను ప్రమాదం తప్పిందని డ్రైవర్ పేర్కొన్నారు.

విద్యార్థి ఆత్మహత్య

శివ్వంపేట(నర్సాపూర్) : అనారోగ్య సమస్యలతో మనోవేదనకు గురై విద్యార్థి ఆత్మహత్యకు పాల్పడిన ఘటన మండల కేంద్రమైన శివ్వంపేటలో శుక్రవారం చోటు చేసుకుంది. ఎస్‌ఐ మధుకర్ రెడ్డి కథనం మేరకు.. గ్రామానికి చెందిన చుక్క స్వామిప్రదీప్(17) తూప్రాన్‌లోని ఓ ప్రైవేట్ కాలేజీలో ఇంటర్ సెకండ్ ఇయర్ చదువుతున్నాడు. మూడేళ్ల కిందట సైకిల్ పై నుంచి పడి తీవ్రగాయాలై డిప్రెషన్‌కి లోనవుతూ ఇబ్బంది పడ్డాడు. కొద్ది రోజుల నుంచి మానసిక స్థితి బాగాలేకపోవడంతో తీ వ్ర మనో వేదనకు గురై శుక్రవారం ఇంట్లోని బాత్‌రూమ్‌లో ఉరి వేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు.

లారీ, ఆటో ఢీ : ముగ్గురికి తీవ్రగాయాలు

వట్‌పల్లి(అందోల్): లారీ, ఆటో ఢీకొన్న ప్రమాదంలో ముగ్గురికి తీవ్ర గాయాలు అయ్యాయి. ఈ ఘటన జోగిపేట పోలీస్‌స్టేషన్ పరిధిలోని అన్నాసాగర్ శివారులో శుక్రవారం చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళ్తే.. చింతకుంట వైపు నుంచి దానంపల్లి గ్రామానికి వెళ్తున్న ఆటోను ఎదురుగా వస్తున్న ఇసుక లారీ ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ఆటోలో ప్రయాణిస్తున్న అందోలు మండలం దానంపల్లి గ్రామానికి చెందిన దుర్గయ్య, మల్లేశం, పోచయ్యకు తీవ్ర గాయాలయ్యాయి. క్షతగాత్రులను వెంటనే జోగిపేట ప్రభుత్వాస్పత్రికి తరలించారు. పోచయ్యకు పరిస్థితి విషమంగా ఉంది. విషయం తెలుసుకున్న జోగిపేట పోలీసులు ఘటనా స్థలాన్ని పరిశీలించి కేసు నమోదు చేశారు.


ప్రమాదంలో దెబ్బతిన్న ఆటో, లారీ


డివైడర్‌పై ప్రమాదకరంగా బస్సు

డివైడర్ పైకి దూసుకెళ్లిన బస్సు

25 మందికి స్వల్ప గాయాలు

కన్‌సాన్‌పల్లి వద్ద నాందేడ్ హైవేపై ఘటన

వట్‌పల్లి(అందోల్): అందోల్ మండల పరిధిలోని కన్‌సాన్‌పల్లి వద్ద ఆర్టీసీ బస్సు అదుపుతప్పి డివైడర్ పైకి దూసుకెళ్లింది. ఈ ప్రమాదంలో 25 మందికి ప్రయాణికులు స్వల్పగాయాలతో బయటపడ్డారు. వివరాల్లోకి వెళ్తే.. నారాయణ ఖేడ్ డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు శుక్రవారం నారాయణఖేడ్ నుంచి జోగిపేట వైపు వస్తున్న క్రమంలో కన్‌సాన్‌పల్లి గ్రామ రోడ్డు వద్దకు రాగానే అదుపు తప్పి జాతీయ రహదారి డివైడర్ పైకి ఎక్కింది. బస్సులో సుమారుగా 50 మందికి పైగా ఉండగా 25 మందికి స్వల్ప గాయాలయ్యాయి. వీరిలో హనుమంతరావు పేటకు చెందిన అంబాదాస్‌కు తలకు, గడి పెద్దాపూర్‌కు చెందిన సుజాత కాలు విరిగింది, ఆమె కొడుకు అనిల్ కు చెయ్యి విరిగింది. క్షతగాత్రులను 108 అంబులెన్స్‌లో జోగిపేట ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ఈ విషయం తెలుసుకున్న జోగిపేట ఎస్‌ఐ పాండు ఘటనా స్థలానికి వెళ్లి ప్రమాదం జరిగిన తీరును పరిశీలించారు. డ్రైవర్ అజాగ్రత్తగా, అతివేగంగా నడపడం వల్లే ఈ ప్రమా దం జరిగిందని ప్రయాణికులు చెబుతున్నారు.

బీజేపీ జిల్లా అధ్యక్షురాలు గోదావరి హౌస్ అరెస్ట్


గోదావరి, స్థానిక నాయకులను హౌస్ అరెస్ట్ చేస్తున్న పోలీసులు

రామచంద్రాపురం (పటాన్ చెరు): బీజేపీ పార్టీ ఆధ్వర్యంలో శుక్రవారం మాసబ్‌ట్యాంక్ వద్ద చేపట్టిన మహాధర్నాలో పాల్గొనడానికి వెళ్తున్న బీజేపీ జిల్లా అధ్యక్షురాలు గోదావరిని స్థానిక కార్యకర్తలను పోలీసులు హౌస్ అరెస్ట్ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ...గురుకుల పాఠశాలలో విద్యార్థులు అనేక ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. గురుకుల పాఠశాల విద్యార్థుల సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. కనీస సౌకర్యాలు లేక చలికాలంలో విద్యార్థులు నరక యాతన పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. సమస్యల పరిష్కారానికి బీజేపీ ఆధ్వర్యంలో ధర్నా చేపడితే అందులో పాల్గొనకుండా ప్రభుత్వం పోలీసులతో అడ్డుకుంటున్నారని మండిపడ్డారు. కాంగ్రెస్ ప్రభుత్వానికి త్వరలోనే ప్రజలు సరైన గుణపాఠం నేర్పిస్తారని తెలిపారు. కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర నాయకులు సి.అంజిరెడ్డి, మహిళా మోర్చా అధ్యక్షురాలు బసమ్మ, భారతినగర్ డివిజన్ బీజేపీ అధ్యక్షుడు నందారెడ్డి, బీజేపీ జిల్లా కార్యవర్గ సభ్యులు బలరాం తదితరులు పాల్గొన్నారు.


స్కై వాచ్ ప్రదర్శనను తిలకిస్తున్న జేవీవీ సభ్యులు

ఆకట్టుకున్న ఇన్‌స్పైర్, సైన్స్ ప్రాజెక్టులు

- తిలకించిన ఎమ్మెల్యే హరీశ్‌రావు
- భారీ సంఖ్యలో విద్యార్థులు హాజరు

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో ఇన్‌స్పైర్, సైన్స్ ఎగ్జిబిట్‌ల ప్రదర్శన రెండురోజు శుక్రవారం కొనసాగింది. ఇందులో విద్యార్థులు అనేక ఎగ్జిబిట్లను ప్రదర్శించారు. వీటిని తిలకించి, నూతన విషయాలను తెలుసుకునేందుకు వివిధ పాఠశాలల నుంచి విద్యార్థులు భారీగా తరలివచ్చారు. దీంతో ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాల ప్రాంగణం సందడిగా మారింది. ఈ ప్రదర్శనను మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు హాజరై తిలకించారు. అనంతరం ఆయన హరీశ్‌రావు మాట్లాడుతూ ప్రతీ విద్యార్థిలోనూ సైంటిస్ట్ ఉన్నాడన్నారు. సమాజాన్ని మార్చే విధంగా సామాజిక వేత్తలుగా ఎదుగాలన్నారు. వ్యవసాయ ఆధారిత ప్రదర్శనలు, వరదలు వస్తే అలర్ట్ చేసే అలారం, సోలార్ విద్యుత్ వినియోగం, తదితర ప్రాజెక్టులు ఆకర్షించాయన్నారు. ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు, ప్రైవేట్ పాఠశాల విద్యార్థులతో పోటీ పడి పరీక్షల్లో రాణించడం, ఇంగ్లిష్‌లో మాట్లాడటం సంతోషంగా ఉందన్నారు. విద్యార్థులు సోషల్‌మీడియా, డ్రగ్స్‌కు దూరంగా ఉండి బంగారు భవిష్యత్ నిర్మించుకోవాలన్నారు. కార్యక్రమంలో జిల్లా విద్యాధికారి శ్రీనివాస్‌రెడ్డి, జిల్లా సైన్స్ అధికారి శ్రీనివాస్, ఆయా మండలాల విద్యాశాఖ అధికారులు, ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు ఉన్నారు.


ఎగ్జిబిట్‌ను తిలకిస్తున్న ఎమ్మెల్యే హరీశ్‌రావు


మేక ఊపిరితిత్తులతో చేసిన ప్రదర్శనను వివరిస్తున్న విద్యార్థులు

ఆల్ఫాజోలం, ఎండు గంజాయి కాల్చివేత


అల్ఫాజోలం, ఎండు గంజాయితో పోలీసులు

- మత్తు పదార్థాలు విక్రయిస్తే కఠిన చర్యలు
- ఎస్పీ ఉదయ్‌కుమార్‌రెడ్డి


మెదక్ మున్సిపాలిటీ: అసాంఘీక కార్యకలాపాలకు పాల్పడే వారిని అరికట్టడం కోసం జిల్లా వ్యాప్తంగా స్పెషల్ టాస్క్ ఫోర్స్ పోలీసుల ద్వారా విస్తృత స్థాయిలో తనిఖీలు చేస్తున్నట్లు జిల్లా ఎస్పీ ఉదయ్ కుమార్‌రెడ్డి తెలిపారు. జిల్లా పోలీసు ప్రధాన కార్యాలయంలో శుక్రవారం ఆమె మాట్లాడారు. డ్రగ్స్ డిస్పోజల్ కమిటీ ఆధ్వర్యంలో రూ.19,86,750 విలువైన 3,988 కిలోల అల్ఫాజోలం, 455.293 కిలోల ఎండు గంజాయి, 33.450 కిలోల గంజాయి చాక్లెట్లు కాల్చివేసినట్లు తెలిపారు. జిల్లా వ్యాప్తంగా వివిధ పోలీస్‌స్టేషన్‌లలో నమోదైన 12 కేసుల్లో నిందితుల నుంచి వీటిని పట్టుకొని సీజ్ చేశామన్నారు. సంగారెడ్డి జిల్లాలోని పాశమైలారం పారిశ్రామిక వాడల్లో మెడికేర్ పరిశ్రమలో కాల్చివేసినట్లు పేర్కొన్నారు. ఎవరైనా గంజాయి, ఇతర మత్తు పదార్థాలను విక్రయిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో జిల్లా డ్రగ్ డిస్పోజల్ కమిటీ చైర్మన్ ఎస్పీ ఉదయ్ కుమార్ రెడ్డి, కమిటీ సభ్యులైన అదనపు ఎస్పీ అడ్మిన్ మహేందర్, సాయుధ దళ డీఎస్పీ రంగ నాయక్, డీసీఆర్బీ సీఐ మధుసూదన్ గౌడ్, మెదక్ రూరల్ సీఐ రాజశేఖర్ రెడ్డి, మెడికేర్ పరిశ్రమ మేనేజర్ శివారెడ్డి, పాల్గొన్నారు.

చిట్టీల పేరుతో కుచ్చుటోపీ

- రూ.52 లక్షలతో వసూలు చేసి పరారీ
- సంగారెడ్డిలోని కపిల్ చిట్ ఫండ్స్ బ్రాంచ్‌లో ఆలస్యంగా వెలుగులోకి..

సంగారెడ్డి క్రైమ్: నెలవారీ చిట్టీల పేరుతో రూ.52 లక్షల కుచ్చుటోపీ పెట్టిన ఘటన సంగారెడ్డి పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలో ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. పట్టణ సీఐ రమేశ్ కథనం మేరకు.. సంగారెడ్డిలోని కపిల్ చిట్ ఫండ్స్ బ్రాంచ్ అసిస్టెంట్ జనరల్ మేనేజర్ పోల్ మహేశ్వర్ 22 తేదీన వినియోగదారుల నుంచి, ఉద్యోగుల నుంచి చిట్టీల పేరుతో రూ.52 లక్షలు వసూల్ చేశారు. అనంతరం రాత్రికిరాత్రే పరారయ్యాడు. 23న నాల్గో శనివారం ఆదివారం వరుస సెలవులు రావడంతో తిరిగి సోమవారం ఆఫీస్‌కు వచ్చిన ఉద్యోగులు రికార్డులు పరిశీలించారు. రికార్డుల్లో నగదుకు సంబంధించి ఎలాంటి సమాచారం లేకపోవడంతో అనుమానం వచ్చి మహేశ్వర్‌కు ఫోన్ చేస్తే అందుబాటులోకి రాలేదు. చిట్ ఫండ్స్‌లో స్థానిక ఉద్యోగి అయిన సంతోష్ నగర్‌కి చెందిన బోనగిరి నితిన్ గౌడ్, పలువురు ఉద్యోగులు 27న స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. వారి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

పథకాల అమలుపై ఆరా



జోగిపేట(అందోల్):అందోల్ గురుకుల పాఠశాల విద్యార్థులతో సివిల్ సర్వీసెస్ శిక్షణ అధికారులు

- అభివృద్ధి పనులను పరిశీలించిన ట్రైనీ అధికారులు

సదాశివపేట(సంగారెడ్డి), జహీరాబాద్‌టౌన్, జోగిపేట(అందోల్): సదాశివపేట ఎంసీహెచ్‌ఆర్‌డీ హైదరాబాద్‌లో శిక్షణ పూర్తికావస్తున్న 11 మంది ట్రైనీ సివిల్స్ అధికారులు రెండో రోజైన శుక్రవారం సదాశివపేట మున్సిపల్ పరిధిలో జరుగుతున్న వివిధ అభివృద్ధి పనులను పరిశీలించారు. పథకాల అమలు తీరును అడిగి తెలుసుకున్నారు. జహీరాబాద్ టౌన్‌లో.. సివిల్స్ ట్రైనీ అధికారులు పర్యటించారు. శిక్షణ అధికారులు వికాస్, చేతన్, అదితి తదితరులు పట్టణంలో బస్తీ దవాఖాలను సందర్శించారు. అలాగే అందోల్– జోగిపేట పురపాలక సంఘం పరిధిలోని.. సంక్షేమ గురుకుల పాఠశాలను సివిల్ సర్వీసెస్ శిక్షణ అధికారుల బృందం సందర్శించింది. అధికారులను మున్సిపల్ చైర్‌పర్సన్ అపర్ణ, వైస్ చైర్మన్ చింతా గోపాల్, కమిషనర్ ఉమ, కౌన్సిలర్లు చౌదరి ప్రకాష్, సత్యంగౌడ్ శాలువాలతో సన్మానించి అభినందించారు. ఆయా కార్యక్రమాల్లో మున్సిపల్ కమిషనర్‌లు ఉమామహేశ్వర్‌రావు, సీహెచ్.తిరుపతి తదితరులు పాల్గొన్నారు.


సదాశివపేట(సంగారెడ్డి), ట్రైనీ అధికారులను సన్మానిస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్, అధికారులు

సాక్షి క్లాసిఫైడ్స్

SERVICES

BUSINESS OFFER

- మీ బంగారం మణప్పురం, ముత్తూట్ ఏ ఇతర ఫైనాన్స్‌లో ఉన్న మా డబ్బుతో విడిపించి మార్కెట్ ధరకు కొనబడును. ఫోన్ : 9177555694 [SCA24000707]

WANTED

- ప్రముఖ కంపెనీలో వర్క్ చేయుటకు స్త్రీ, పురుషులు కావలెను. Qul: 10th - డిగ్రీ, Sal: 20K - 30 K మీ అడ్రస్ వాట్సాప్ చేయగలరు. వర్క్ ఫ్రం హోం అవకాశం కలదు. 8121818692 [M-1253927]
- హరేకృష్ణ హోంకేర్‌లో వృద్ధులను పేషెంట్లను చూసుకొనుటకు వర్కర్స్/ నర్సులు కావలెను. ఫ్రీ వసతి ఫుడ్ జీ: 18K. Ph: 9640258899, 9640468899 [SCA24000705]
- TATA లైఫ్ ఇన్సూరెన్స్ కంపెనీలో పని చేయుటకు అడ్వయిజర్స్ కావలెను. కమీషన్ ఇవ్వబడును. పార్ట్/ఫుల్ టైం. Cont: 9912666151 [H-1265952]

గమనిక

సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్/ డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.